

'అవకతవకల సొమ్మును రికవరీ చేస్తాం'

బిచ్కుంద, ఆగస్టు 14: ఉపాధి హామీ పనులలో అవకతవకలకు పాల్పడినట్లయితే ఆ సొమ్మును రికవరీ చేస్తామని డీఆర్‌డీవో ఏపీడీ వామన్‌రావు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద 14వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ సర్వేపై ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో 249 పనులు చేపట్టగా.. జరిగిన పనుల విచారణ అనం తరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఇందులో సోషల్ ఆడిటర్ ప్రశాంత్, ఎస్‌ఆర్‌పీ రంజిత్‌కుమార్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఏపీవో తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



జోరుగా.. జూదం!

- జిల్లాలో నిషేధం ఉన్నప్పటికీ.. కొనసాగుతూనే ఉన్న పేకాట
- సరిహద్దు ప్రాంతాల్లో పేకాట స్థావరాలు
- ఇటీవల బాన్సువాడ డివిజన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు
- పేకాటరాయుళ్లకు స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు
- చేతులు మారుతున్న రూ.లక్షలు
- పోలీసుల పేరిట పేకాటరాయుళ్ల నుంచి కేటీ వసూళ్లు
- పేకాట నిర్వహకులకు అండగా ఉంటున్నారనే ఆరోపణలతో పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిపై వేటు
- తాజాగా బాన్సువాడ డివిజన్‌లో ఓ ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్ల బదిలీ

కామారెడ్డి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దు ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాలు, స్టార్ హోటళ్లు, అపార్ట్‌మెంట్లలో రహస్యంగా పేకాట అడ్డాలను ఏర్పాటు చేసి జూదం జోరుగా నిర్వహిస్తున్నారు. ఇటీవల బాన్సువాడ డివిజన్‌తో పాటు ఎల్లారెడ్డి, కామారెడ్డి డివిజన్ సరిహద్దు మండలాల్లో పేకాట స్థావరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేయడ మే ఇందుకు నిదర్శనం. జిల్లాలో జోరుగా పేకాట కొనసాగుతున్నా.. స్థానిక పోలీసులు మాత్రం దాడులు చేయకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. ఈ ప్రాంతంలో స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు పేకాట నిర్వాహకులకు అండ గా ఉంటూ.. వారితో కలిసి పేకాట ఆడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. స్థానిక పోలీసులకు ముడుపులు అందిస్తూ.. పేకాట నిర్వస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఆయా పోలీసు స్టేషన్‌ల అధికారులు దాడులు చేయడం లేదని నిఘా వర్గాలు సైతం పేర్కొంటున్నాయి.

సరిహద్దుల్లో గుట్టుగా పేకాట

జిల్లాలోని సరిహద్దు మండలాలైన్ల నస్రూళ్లబాద్, బీర్కూర్, బాన్సువాడ, జుక్కల్, పిట్లం, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్, మద్నూర్, బిచ్కుంద మండలాల్లోని పరిసరాల ప్రాంతాల్లో పేకాట జోరుగా కొనసాగుతోంది. ఈ మండలాల పరిధిలోని రహస్య ప్రదేశాలతో పాటు అటవీ ప్రాంతాల్లో పేకాట మూడు పువ్వులు.. ఆరు కాయాలుగా కొనసాగుతున్నా పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో రహస్య స్థలాన్ని ఎంపిక చేసి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తూ పేకాటరాయుళ్లు, నిర్వాహకులు ఏజెంట్లుగా వ్యవహరిస్తు పోలీసులు, ప్రజాప్రతినిధులు మాచేతిలోని అంటూ జోరుగా పేకాట కొనసాగిస్తున్నారు. ఇటీవల నస్రూళ్లబాద్ మండలంలో శివారు అటవీ ప్రాంతాలలో పేకాట ఆడు తున్న రెండు స్థావరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పేకాటరాయుళ్లను పట్టుకోవడంతో పాటు నగదు సీజ్ చేశారు. ఎల్లారెడ్డి, పెద్దకొడప్‌గల్, జుక్కల్ ప్రాంతాల్లోనూ పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు.

స్టార్ హోటళ్లు, అపార్ట్‌మెంట్లే అడ్డాలు

జిల్లాలో పేకాట నిషేధం ఉన్నప్పటికీ పేకాట నిర్వాహకులు, జూదం ప్రియులు ప్రత్యేక అడ్డాలను ఏర్పాటు చేసుకుంటూ దర్జాగా కొనసాగిస్తున్నారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడి పట్టణాల్లోనూ దాదాపు పేకాట క్లబ్బులను పోలీసులు మూసివేయించారు. దీంతో పేకాటప్రియులు నగరం, పట్టణాల్లోని అపార్ట్‌మెంట్లు, స్టార్ హోటళ్లు, లాడ్జీలు, దాబాలతో పాటు శివారు ప్రాంతాల్లో ప్రతినిత్యం గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారు. క్లబ్బులు బంద్ కావడంతో జూదరులు రోజుకొక అడ్డాను మారుస్తున్నారు. ఈ అడ్డాలకు పేకాట ఆడడానికి వచ్చే వ్యక్తులను ఆట ముగిసేంత వరకు బయటకు వెళ్లకూడదనే నిబంధన పెడుతూ నిర్వాహకులు పేకాటను కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. పట్టణాల్లోని కొన్నిస్టార్ హోటళ్లలో విచ్చలవిడిగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం. హోటళ్లలో ఉండే రూమ్ రెంట్‌కు అదనంగా రెండు, మూడింతలు డబ్బులు చెల్లిస్తూ నాలుగైదు రూమ్‌లను బుక్ చేసుకుని పేకాట నిర్వాహకులు దర్జాగా నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఎక్కడ తనిఖీలు చేస్తారోనని జాగ్రత్త పడుతూ రోజురోజుకు హోటళ్లలో అడ్డాలను మారుస్తున్నారు. ఇక లాడ్జీలలో పోలీసులు తనిఖీలకు వచ్చారంటే చాలు.. సంబంధిత మేనేజర్లు, అందులో ఉండే బాయ్‌ల ద్వారా పేకాట రాయుళ్లకు సమాచారం చేరవేయడంతో పేకముక్కలను దాచేసి అక్కడ మద్యం తాగి ఉన్నట్లు మద్యం బాటిళ్లు, గ్లాసులు ముందు పెట్టుకుని ఉంటున్నారు. అంతేకాకుండా జిల్లాకేంద్రంలోని ప్రధానంగా అపార్టుమెంట్లలో జూదం జోరుగా కొనసాగుతున్నట్లు నిఘా వర్గాల ద్వారా వెల్లడైంది.

ప్రజాప్రతినిధుల వత్తాసు

నస్రూళ్లబాద్, బీర్కూర్, బాన్సువాడ, కామారెడ్డి ప్రాంతాలలో పేకాటరాయుళ్లకు ప్రజాప్రతినిధులు వత్తాసు పలకడమే కాకుండా పేకాట నిర్వహించే వారు పోలీసుల పేరిట కేటీ వసూలు చేస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా పరిధిలోన్ని పలు మండలాల్లో గల ఆయా గ్రామాల్లో రహస్య ప్రదేశాలలో కాకుండా ప్రజాప్రతినిధుల ఇళ్లలో పేకాటరాయుళ్లు లక్షల రూపాయలు పెడుతూ పేకాట కొనసాగిస్తున్నారు. పోలీసుల పేరిట ఒక్కొక్క ఆటకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతాల్లోని కీలకమైన ప్రజాప్రతినిధులు కూడా పేకాటలో పాల్గొంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాజకీయ నాయకులు పేకాట ఆడుతూ పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. ఈ ప్రాంతాలకు చెందిన మండల, గ్రామీణస్థాయి ప్రజాప్రతినిధులు అక్రమార్జన కోసమే పేకాట ను కొనసాగిస్తూనే ఉన్నారు.

స్థానిక పోలీసుల అండదండలు

జిల్లాలో జోరుగా పేకాట కొనసాగుతున్నప్పటికీ.. స్థానిక పోలీసులు దాడులు చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు అండదండలతో పేకాట జోరుగా నిర్వహిస్తున్నారని ఆరోపణలు సైతం వస్తున్నాయి. పేకాట నిర్వాహకులే పోలీసులకు ముడుపులను అప్పజెప్పి వత్తాసు పలకుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధిలో రహస్యంగా నిర్వహించే పేకాటస్థావరాలను పోలీసులు గుర్తించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు జరపకపోవడంతో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుంటుండడం స్థానిక పోలీసుల పనితీరుకు నిదర్శనం. పేకాట నిర్వహణపై జిల్లాపోలీసు ఉన్నతాధికారులు సైతం సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఇటీవల బాన్సువాడ డివిజన్ పరిధిలోని ఓ మండలంలో పేకాట నిర్వాహకులకు స్థానిక ఎస్‌ఐ, మరో ఇద్దరు కానిస్టేబుళ్ల సహకరిస్తూ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై పోలీసు శాఖలోని నిఘా వర్గాలు విచారించగా.. సదరు ఎస్సై, కానిస్టేబుళ్ల పేకాట నిర్వాహకులకు సహకరించారని తేలింది. దీంతో ఇద్దరు కానిస్టేబుళ్లను అక్కడి నుంచి బదిలీ చేయగా.. సదరు ఎస్సైకి నోటీసులు జారీ చేశారు. దీంతో ఎస్సై సెలవు పెట్టి వెళ్లినట్లు తెలిసింది.





పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రొఫెసర్ అరుణ

సౌత్ క్యాంపస్‌లో పరీక్ష కేంద్రం తనిఖీ

భిక్కనూరు, ఆగస్టు 14: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం పరీక్ష కేంద్రాన్ని తెలంగాణ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ అరుణ ఆకస్మిక తనిఖీ చేశారు. కాగా చివరి రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు మొత్తం 213 మంది విద్యార్థులకు గాను 207 మంది హజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సుధాకర్‌గౌడ్ తెలిపారు.

20న వాణిజ్య, వ్యాపార సంస్థల బంద్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 14: కామారెడ్డి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణవర్తక, వాణిజ్య, వ్యాపార సంఘాలు ఈనెల 20న బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బంద్‌కు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 20న అన్ని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ చేసి ఉదయం 9 గంటలకు స్థానిక జేపీఎన్ విగ్రహం వద్దకు వచ్చి అక్కడి నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

● ఇందిరాగాంధీ స్టేడియం వేదికగా వేడుకలు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 14: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ టూరిజం ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అదేవిధంగా, ఇందిరాగాంధీ స్టేడియంలో వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేశారు. పాఠశాలల విద్యార్థులతో వైభవోపేతంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.









ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశారిలా..



లక్ష్మీరావులపల్లిలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

పరిసరాల పరిశుభ్రత పాటిస్తే.. వ్యాధులు రావు : కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్

మాచారెడ్డి, ఆగస్టు 14: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రావని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామంలో బుధవారం కలెక్టర్ పర్యటించారు. ఇటీవల డెంగ్యూ పాజిటివ్ వచ్చి కోలుకున్న బాధితుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. డెంగ్యూ జ్వరం రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల చుట్టు ఉన్న పరిసరాలను పరిశీలించారు. ఇళ్ల ముందున్న డ్రమ్ములలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచరాదని తెలిపారు. మురుగు కాలువలు శుభ్రంగా ఉంచాలని, ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శి విజయను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. పరిసరాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వర్షం నీరు నిలువ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. అలాగే మండల కేంద్రంలో గల పీహెచ్‌సీలో హాజరు పట్టికను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలను వైద్యాధికారి ఆదర్శ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీసీ వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీఎల్‌పీఓ శ్రీనివాస్, ఎంపీడీవో గోపి, తహసీల్దార్ శ్వేత, పంచాయతీ కార్యదర్శి అస్మాబేగం, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి శాపంగా ఇసుక మేటలు!

● 29 టీఎంసీల ప్రాజెక్టు.. ప్రస్తుతం 17.8 టీఎంసీల నీటి సామర్థ్యానికే పరిమితం ● నిజాంసాగర్ ప్రాజెక్టు మొత్తంలో 48 వరద గేట్లు ● 2.75 లక్షల ఎకరాలకు గాను లక్షా 35వేల ఎకరాల ఆయకట్టుకే నీరు

నిజాంసాగర్, ఆగస్టు 14: ఉభయ జిల్లాల వరప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉభయ జిల్లాల్లో పండించిన సిరులు నిజామాబాద్ ఉభయ జిల్లా ధాన్యాగారంగా కీర్తి పొందింది. కానీ, నిజాంసాగర్ ప్రాజెక్టులో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరిన ఇసుక మేటలు ఉభయ జిల్లాల రైతాంగానికి శాపంగా మారింది. ఆ నాడు నైజాం ప్రభుత్వ హయాంలో 182.9 లక్షల రూపాయల వ్యయంతో నిజాంసాగర్ ప్రాజెక్టును 36వేల 151 ఎకరాల శిఖంలో నీరు నిల్వ ఉండేందుకు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణం 1923 నుంచి 1931 వరకు ఎనిమిది సంవత్సరాల పాటు నిర్మాణం చేపట్టిజాతికి అంకితం చేశారు. అప్పట్లో నిజాంసాగర్ ప్రాజెక్టు 29 టీఎంసీల నీరు నిల్వ చేస్తూ ఉండేది. 1935లో ప్రధాన కాల్వతో పాటు పిల్ల కాల్వల నిర్మాణం 183.13 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టారు. కాలక్రమేణా ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు 94 సంవత్సరాలుగా ప్రాజెక్టులోనికి ఇసుక మేటలు వచ్చి చేరుతూనే ఉండటంతో 29 టీఎంసీల నీటి నిల్వలకు గాను, ఇసుక మేట 12 టీఎంసీలు నిండిపోవడంతో 17 టీఎంసీలకు నీటి సామర్థ్యానికి చేరుకుపోయింది. నిజాంసాగర్ ప్రాజెక్టు కేవలం లక్షా 35వేల ఎకరాలకే నీరు అందించేందుకు పరిమితమైంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపు ప్రాంత భూములకు, ఆయకట్టు తొలగించిన పిదప నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రెండు లక్షల 31 వేల 339 ఎకరాలకే పరిమితం కాగా, 2007లో అలీసాగర్ ఎత్తిపోతల పథకాన్ని 269 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టారు. అలీసాగర్ దిగువన 53.793 ఎకరాలకు సాగర్ ఆయకట్టు కింద ఉన్న రైతులు లబ్ధి పొందుతూనే ఉన్నారు. 2008లో అర్గుల్ రాజారాం ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని 204 కోట్లరూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టారు. ఈ పథకం ద్వారా అలీసాగర్, గుప్త చెరువుల దిగువన ఉన్న 38,792 ఎకరాలకు సాగర్ ఆయకట్టు రైతాంగం లబ్ధి పొందారు. ఈ పథకాల ద్వారా నిజాంసాగర్ ఆయకట్టు 92వేల 585 ఎకరాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని మినహాయించారు. కేవలం లక్షా 35వేల ఎకరాలకే నిజాంసాగర్ ప్రాజెక్టును పరిమితం చేశారు. మరో 60 వేల ఎకరాలు నిజాంసాగర్ ఆయకట్టు కాగా, బోరు బావుల కిందనే రైతాంగం పంటలను పండించుకుంటూనే ఉన్నారు. 1923లోనిర్మాణం చేపట్టిన ప్రాజెక్టుకు ప్రధాన కాల్వతో పాటు 82 డిస్ట్రిబ్యూటరీలు నిర్మాణం చేసినప్పటికీ.. ప్రధాన కాల్వకు గండ్లు పడటం, ఇసుక మేటలు వచ్చి చేరడంతో 2008లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 549.60 కోట్ల రూపాయల వ్యయంతో ప్రధాన కాల్వ, ఇసుక మేట తొలగింపుతో పాటు లైనింగ్ పనులు చేపటారు. ప్రధాన కాల్వనీటి పరిణామం 3,400 క్యూసెక్కులకు గాను 1,600 క్యూసెక్కులకే ప్రధాన కాల్వ పరిమితమైంది. నిజాంసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సింగూరు నుంచి సాగర్‌కు ఇవ్వాల్సిన ఎనిమిది టీఎంసీల నీటిని ప్రభుత్వాలు, పాలకులు మారినా ఎనిమిది టీఎంసీల నీరు నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీటి నిల్వలు తగ్గినప్పుడు ఇవ్వలేక పోతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు సింగీతం చెరువును ఆధునికీకరణ చేసి 0.5 టీఎంసీల నీటిని వర్షాకాలంలో ప్రధాన కాల్వలోకి విడుదల చేస్తుంటారు. నిజాంసాగర్ ప్రాజెక్టును నమ్ముకున్న రైతాంగానికి ఇసుక మెట్ట వచ్చి చేరడంతో 17 టీఎంసీల నీటి నిల్వలుండటంతో కేవలం యాసంగికే 10 టీఎంసీల నీటిని విడుదల చేస్తుంటారు. యాసంగి వర్షాకాలానికి నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి దాదాపు 16 నుంచి 17 టీఎంసీల నీరు అవసరమవుతుంది. గత యేడాది భారీ వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిని 24.674 టీఎంసీల నీటిని దిగువ మంజీరాలోనికి విడుదల చేశారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా నిజాంసాగర్‌పై నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారు. నిజాంసాగర్‌లో పెరిగిన ఇసుక మేటలను తొలగించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతాంగం నిరాశ చెందతూనే ఉన్నారు. అనాడు నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు ఇసుక మేటల వల్ల నీటి నిల్వలు తరిగి కేవలం లక్ష 35 వేల ఎకరాల్లోనే రైతాంగం సిరులు పండిస్తున్నారు. తెలంగాణలోనే మొదటి ప్రాజెక్టు అయిన నిజాంసాగర్ ప్రాజెక్టును పునర్ నిర్మాణం చేపట్టి ఉభయ జిల్లాల రైతాంగానికి పూర్తిస్థాయి నీరందించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టులో ఇసుక మేట ద్వారా తగ్గిన నీటిసామర్థ్యం

డైట్ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 14: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు వివిధ సబ్జెక్ట్‌లలో ఎంఏ/ఎమ్మెస్సీ/ఎంఈడీ లేదా ఎంపీఈడీ లేదా ఎంఎఫ్ఏ/బీఎఫ్ఏ అర్హతగల నూతన, రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. దరఖాస్తులను ఈనెల 21లోగా సమర్పించాలని అభ్యర్థుల ఎంపిక మెరిట్, ఇంటర్వ్యూ, డెమో ఆధారంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎంపిక చేయబడిన అతిథి అధ్యాపకులు అకాడమిక్ సంవత్సరం చివరి పనిదినం వరకు ఉంటుందని నెలకు రూ.23,400లు, వ్యాయామ విద్య, కళా విద్య పోస్టులకు రూ.15,600లు గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియాలలో ఫిలాసఫీ/సోషియాలజీ, గణిత శాస్త్ర బోధన పద్ధతులు, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతులు వ్యాయామ విద్య, కళా విద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉర్దూ మీడియంలో ఫిలాసఫీ/సోషియాలజీ, సామాన్య శాస్త్ర బోధన పద్ధతులు, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతులు, ఉర్దూ బోధన పద్ధతుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని సంబంధిత సబ్జెక్టులలో పీజీ, ఎంఈడీ, ఎంపీఈడీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నర్సింగ్ విద్యార్థినుల వసతుల సౌకర్యాల కోసం ప్రతిపాదనలు

● ఇచ్చిన మాటనే వెంటనే అమల్లోకి తేవడం ఎమ్మెల్యేకే సాధ్యం : టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్

బోధన్‌రూరల్,ఆగస్టు14: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంగళవారం బోధన్ ఆసుపత్రిని సందర్శించి నర్సింగ్ వసతి గృహాన్ని పరిశీలించి అదనపు గదులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ఆయనకు ఆయనే నిదర్శనమని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నర్సింగ్ విద్యార్థినుల వసతి గృహాన్ని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పరిశీలించారు. విద్యార్థినులకు అదనపు గదుల సౌకర్యాల కోసం యుద్ధ ప్రాతిపదికన పంచాయతీ రాజ్ అధికారులు చర్యలు చేపట్టి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వసతిగృహం పైభాగంలో షెడ్ ద్వారా గదులను ఏర్పాటు చేసి విద్యార్థినులకు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే హయంలోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం నర్సింగ్ స్కూల్ ప్రారంభమైందని నేడు వసతి గృహం కోసం అదనపు గదులు కూడా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హయంలోనే ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డయాలసిస్ పేషెంట్లు ఆసుపత్రిలోని పై అంతస్తులకు వెళ్లడం వైద్యం చేయించుకోవడం ఇబ్బందిగా ఉందని డయాలసిస్ కేంద్రాన్ని ఖాళీగా ఉన్న ఆర్ఎంవో క్వాటర్స్‌లోకి మార్చాలని దానికి సైతం చర్యలు చేపడుతున్నామన్నారు. వర్షాలకు పాత భవనాల నుండి వర్షపు నీరు ఉరువకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెంట్ డాక్టర్ సుమంత్, పంచాయతీ రాజ్ శాఖ జిల్లా అధికారి రాజయ్య, ఏఈ లిఖిత, తహసీల్దార్ విఠల్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్, సంబంధిత శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.


నర్సింగ్ స్కూల్ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పడిగెలలో శుక్రవారందేవి విగ్రహా ప్రతిష్ఠాపన

వేల్పూర్,ఆగస్టు14: వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో నూతనంగా నిర్మించిన శుక్రవారందేవి ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురు వారం దేవి విగ్రహా విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగా వైభవంగా నిర్వ హించారు. అంతకు ముందు బ్రహ్మణ వేద పండితులు మంత్రోచ్చరణాల మధ్య యజ్ఞం, పూర్ణహుతి, విగ్రహా ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పడిగెల గ్రామంతో పాటు చుట్టు పక్కల గారమాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి శుక్రవారం దేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోధన్‌లో హర్ ఘర్ 'తిరంగా' ర్యాలీ


బోధన్‌లో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు14: బోధన్ పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ 'తిరంగా' ర్యాలీ నిర్వహించారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన 'తిరంగా' ర్యాలీ పట్టణంలోని పాత బస్టాండ్, పోస్టాఫీస్, శక్కర్‌నగర్ చౌరస్తా ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి ప్రజలు దేశభక్తిని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కూరేళ్ల శ్రీధర్, బీజేవైఎం యోగేష్, పట్టణ అధ్యక్షులు బాలరాజు, శివసేన అధ్యక్షుడు పసులోటి గోపికిషన్, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్న, బీజేపీ నాయకులు అరవింద్, వాసు, సందీప్, వెంకటేష్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● మోస్రాలో..

మోస్రా గ్రామంలో హర్ ఘర్ 'తిరంగా' యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అభిలాష్ గౌడ్, సహ ఇన్‌చార్జి సాయిలు, తాజా మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, మండల ఉప అధ్యక్షుడు లింగం, కార్యదర్శి హన్మా గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు లతీఫ్ ఖాన్, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాలీబాల్ పోటీలు

మోపాల్, ఆగస్టు 14: పంద్రాగస్టు సందర్భంగా మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు పంద్రాగస్టు రోజున బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, ముదక్‌పల్లి, మంచిప్ప, బాడ్సి, మో పాల్, కంజర్‌లో నిర్వహించారు.

హిందు ధర్మరక్షణకు కృషి చేయాలి

● నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్


బోధన్‌లో మాట్లాడుతున్న నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్

బోధన్‌రూరల్,ఆగస్టు14: హిందు ధర్మరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, ప్రతి ఇంట్లో శివాజీని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. బుధవారం సాయంత్రం బోధన్ పట్టణంలోని మారుతి మందిరం వద్ద హనుమాన్ వ్యాయమ శాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేశారు. విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ బోధన్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం, సీట్ల కోసం కనిపించే రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీజాబాయి శివాజీకి కడుపులో ఉన్నప్పుడే వీరగాధలు చెప్పి హిందు ధర్మ రక్షకుడిగా తయారు చేసిందని, అలాగే భారతదేశంలో ప్రతి ఇంట్లో శివాజీలాంటి వ్యక్తిని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హిందువులు ఐక్యమత్యంతో ఉండాలని, ఎటువంటి పరిస్థితి వచ్చిన ఒక్క అడుగు వెనక్కి వేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, హరికృష్ణ రెడ్డి, కోటేశ్వర్‌రావు, విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు14: పట్టణంలోని అక్రమ వసూలు చేస్తున్న శ్రీచై తన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌వీఎస్ విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్ట ణంలోని శ్రీచైతన్య పాఠశాల ముందు నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య ఒలింపియాడ్ టెస్ట్ ముసుగుతో విద్యార్థుల నుంచి రూ.300అదనంగా వసూలు చేస్తున్నారని, అలాగే సెక్షన్ పేరు మీద అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.ఈ కార్యక్ర మంలో మండల నాయకులు టీఎన్‌వీఎస్ మండల నాయకులు సాయి, కిశోర్, దిలీప్, వికాస్, విగ్నేష్, చరణ్, సిద్దు, పాల్గొన్నారు.

విద్యార్థులపై కుక్కల దాడి

బోధన్‌రూరల్,ఆగస్టు14: బోధన్ పట్టణంలోని శర్బత్ కెనాల్ లయోల పాఠశాల ఎదురుగా గల వీధిలో బుధవారం విద్యార్థులపై కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఉస్మాన్ వలియొద్దీన్, ఉబర్ సలవుద్దీన్ అనే విద్యార్థులు పాఠశాలకు వెళ్తుండగా వెనుక నుండి ఒక్కసారిగా వీధి కుక్కలు దాడులు చేశారని కాలనీ వాసులు బ్యాంక్ బషీర్, తదితరులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● పట్టపగలే లక్ష్యంగా తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
● నాలుగు తులాల బంగారం రికవరీ

ముప్కాల్, ఆగస్టు14: బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో జరిగిన అంతరాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్టు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. బుధవారం బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై యాసిర్‌అర్ఫాత్ వివరాలు వెల్లడించారు. గత నెల 19న చిట్టాపూర్ గ్రామంలో పుంచెట్టి లింగన్న రోజు లాగానే తన ఇంటికి తళం వేసి వ్యవసాయ పనులకు వెళ్ళాడు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి కనిపించడంతో కంగారు తిన్న ఆయన ఇంట్లోకి వెళ్ళి చూడగా బెడ్‌రూంలో సామాన్లు చెల్లచెదురుగా పడి ఉన్నాయి. బీరువలోని ఎనిమిది తులాల బంగారం, నగదు, బాధితుడు బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు, క్లూస్‌టీం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బుధవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు నాందేడ్ జిల్లాకు చెందిన ముస్కుర్ నామ్‌దేవ్, మహాదేవ్ అలియాస్ శివ ఆర్మూర్ బస్టాండ్‌లో అనుమానస్పదంగా కనిపించడంతో ఎస్సై సిబ్బందితో కలిసి వారిని విచారించగా చిట్టాపూర్‌లో చేసిన చోరీ గురించి వివరించారు. నిందితుల నుంచి ఆరు తులాల బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగతా రెండు తులాలు మనపురం గోల్డ్‌లోన్‌లో ఫిక్స్ డిపాజిట్ చేసినట్టు నిందితులు ఒప్పుకున్నారు. డిపాజిట్ చేసిన బంగారాన్ని లీగల్ విడిపించే ప్రయత్నం చేస్తున్నామని సీఐ వెల్లడించారు. నిందితుడిపై ఇదీ వరకే పలు పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయని, జైలు నుంచి వచ్చిన రెండు రోజులకే చిట్టాపూర్‌లో చోరీకి పాల్పడినట్టు పేర్కొన్నారు. తాళం వేసిన ఇళ్లలో పట్టపగలే లక్ష్యంగా చోరీకి పాల్పడుతున్నామని వారు తెలిపారు. నిందితుడితో పాటు చోరీకి సహకరించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఊరికి వెళ్లే ముందు తమ విలువైన వస్తులను బ్యాంకులో గాని, వెంట తీసుకువెళ్లాలని పోలీసులకు, చుట్టు పక్కల వారికి సమాచారం అందిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై శంకర్, హెడ్‌కానిస్టేబుల్ విఠల్, రే వంత్, కానిస్టేబుళ్లు లింగన్న, ప్రశాంత్, నరేష్, పవన్, తదితరులు ఉన్నారు.


బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి

జీజీహెచ్‌లో జూడాల ఆందోళన


నిరసన తెలుపుతున్న జూడాలు

పెద్దబజార్, ఆగస్టు 14: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో కలకత్తాలోని ఆర్‌జికర్ మెడికల్ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్‌పై ఇటీవల జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల జిల్లా అధ్యక్షుడు జితిన్ మాట్లాడుతూ కలకత్తాలోని ఆర్‌జికర్ మెడికల్ కళాశాల క్యాంపస్‌లో రెండవ సంవత్సరం పీజీ విద్యార్థిని దారుణంగా చంపడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్లు అనుమానించబడిన ఈ క్రూరమైన నేరం వైద్య సంస్థలు ఆసుపత్రులలో తీవ్రమైన భద్రత సమస్యలను ఎత్తి చూపుతుందని ఎద్దేవా చేశారు. తమ డిమాండ్ నెరవేరే వరకు న్యాయం జరిగే వరకు సమ్మె విరమించబోమని జూడాలు తెలిపారు. నో సేఫ్టీ, నోడ్యూటీ అంటూ ప్లకార్డులను చేతబట్టి నిరసన తెలియజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అడ్వైజర్ ప్రణయ్, రాష్ట్ర వైస్‌ప్రసిడెంట్ రమ్య, గ్రీష్మ, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ మృతుడి తల్లికి ఆర్థిక సహాయం

సిరికొండ ఆగస్టు 14 : ప్రమాదవశాత్తు గల్ఫ్ దేశంలో మరణించిన గడ్కోల్ గ్రామ యువకుడు సందీప్‌గౌడ్ తల్లికి అదే గ్రామానికి చెందిన గల్ఫ్ యూనియన్ పేరుతో పనిచేస్తున్న సంఘ సభ్యులు రూ.40వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. 1998 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సందీప్‌గౌడ్ కుటుంబ సభ్యులకు రూ.35వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నక్క రాజేశ్వర్,సుదర్శన్‌గౌడ్,రమేష్‌రెడ్డి,గంగాదర్,రఫిక్,వినోద్,రాజు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో యువకుడి ఆత్మహత్య

మోర్తాడ్, ఆగస్టు14: మోర్తాడ్ మండల కేంద్రానికి బోగ సాయికుమార్ (25) వరదకాలువలో పడి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మృతుడు సాయికుమార్ ఇంటి నుంచి బయలుదేరి మోర్తాడ్ శివారులోని పాలెం బ్రిడ్జి గాండ్లపేట్ శివారులో గల వరదకాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబసభ్యుల వల్ల మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. బుధవారం శవాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు పంపి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ధర్పల్లి ఎస్‌హెచ్‌వోగా రామకృష్ణ

ధర్పల్లి, ఆగస్టు14: ధర్పల్లి స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా ఎ.రామకృష్ణ బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన విక్రం బదిలీ కావ డంతో ఎస్‌హెచ్‌వోగా రామకృష్ణ బాధ్యతలను చేపట్టా రు. మండలంలో శాంతి భద్రతల కోసం మండల ప్రజలు సహకరిం చాలన్నారు.ఫ్రెండ్లీ పోలీస్‌యే లక్ష్యంగా ముందుకు వెళ్తామని చెప్పారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా క్రీడాకారులు

● జిల్లా జట్టులో భారతీయ జట్టు క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య

సుభాష్‌నగర్, ఆగస్టు 14: పదోరాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఫారుఖ్ అలీ,జావీద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 16 నుంచి ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్,ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణలు హాజరుకానున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారు లు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. నిజామాబాద్ జిల్లా జట్టులో భారత్ జట్టు క్రీడాకారిణి సౌమ్య పాల్గొననున్నారని తెలిపారు. జిల్లా జట్టుకు చీఫ్ కోచ్‌గా వక్తపాల్, మేనేజర్‌గా అజ్మత్‌ఖాన్, అసిస్టెంట్ కోచ్‌గా ఒట్టిపాటి నాగరాజులు వ్యవహరించనున్నారు.

● ఎంపికైన క్రీడాకారులు వీరే...

రోనిషా, అశ్విని, నక్షత్ర, రష్మిక, మధుశ్రీ, విజయలక్ష్మి, గుగులోత్ సౌమ్య, సహస్ర, మోక్ష తపస్వి, సాయిసమీక్ష, ప్రజ్ఞ, సింధూర, శ్రీష్మ, సుశాంతిక, హరిణి యాదవ్,జాహ్నవి యాదవ్,లహరి,దీపిక చౌదరి,నిశిత,మాధవి,సంజన, రిశ్విక, జరీన్, మనస్విని, నిర్వి, సయుదా,సలేహా,ఫాతిమాలు ఎంపికయ్యారు.

గోపంగిలను ఎస్సీ(సి) లో చేర్చాలి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 14: సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పులో భాగంగా గోసంగి కులాలవారిని ఎస్సీ-సీ లేదా ఎస్సీ-బీలో చేర్చాలని కోరుతూ..జిల్లా గోపంగి సంగం అధ్యక్షుడు ఈర్నాల వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల గోసంగిసంఘాల సభ్యులు బుధవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ.. గోసంగి సంఘాల సభ్యుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తెచ్చి సమస్యపరిస్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రముఖులు జిల్లా ఉపాధ్యక్షుడు సదుల శ్రీనివాస్,జిల్లా సలహాదారులు ఈర్నాల లింగయ్య, కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు ఊరనర్సయ్య, గందం శ్రీనివాస్, ప్రశాంత్, ఈర్నాల గంగాధర్, గడ్డం లక్ష్మన్ ఉన్నారు.

జాతీయ పతాకాల వితరణ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు14: పట్టణంలోని గోల్‌బంగ్లా, కమలానెహ్రూకాలనీ, హుస్నాబాద్‌గల్లీలో ఇంటింటికి జాతీయ పతాకాలను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతీ ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలని అన్నారు. స్వాతంత్ర సంబురాన్ని, దేశభక్తిని చాటుకుందామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కార్యదర్శి ఎంజె.రమేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి దూకి యువతి ఆత్మహత్య

రెంజల్,ఆగస్టు14: మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో దూకి యువతి ఆత్మహత్య చేసుకుందని స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోధన్ గ్రామానికి చెందిన యువతి కందకుర్తి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు చూసి జాలర్లకు సమాచారం అందించడంతో జాలర్లు వచ్చి యువతి మృతదేహాన్ని ఒడ్డుకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు.

నాగన్‌పల్లి బ్రిడ్జి వద్ద గుంతల పూడ్చివేత

బోధన్‌రూరల్,ఆగస్టు14: బోధన్, నాగన్‌పల్లి ప్రధాన రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడడంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గుంతలను పూడ్చివేయించారని సాలూర కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మందర్నా రవి అన్నారు. బుధవారం నాగన్‌పల్లి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎమ్మెల్యే వెంట వెంటనే చర్యలు తీసుకుంటున్నారని మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లె రమేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రావు, గ్రామస్థులు తదితరులున్నారు.

ఇసుక వేలం పాట వాయిదా

కోటగిరి,ఆగస్టు14: పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఇసుక వేలంపాట నిర్వహించారు. మండలంలోని కొడిచర్ల గ్రామంలో 25 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఆర్ఐ సాయిలు ఆధ్వర్యంలో ఇసుక వేలంపాట నిర్వహించగా ఆరుగురు హాజరయ్యారు. వేలంలో పాల్గొనే వారు సిండికేట్ కావడంతో 5వేలకు మించి వేలం రాకుండాపోయింది. రెవెన్యూ అధికారులు రూ.30వేల వరకు వేలం వస్తుందని ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఇసుక వేలంపాటను వాయిదా వేశారు.

నవీపేటలో కొవ్వొత్తుల ర్యాలీ

నవీపేట,ఆగస్టు14: మండల కేంద్రంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం, ఆర్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దాడులలో మృతి చెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలి

రుద్రూరు, ఆగస్టు 14 : పర్యావర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, విధి ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలని రుద్రూరు ఎస్ఐ అప్పారావు పేర్కొన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో బుధవారం ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల,లయన్స్ క్లబ్, ధాత్రిశ్రీ ఆధ్వ ర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళా శాల అధ్యాపకులు కళాశాల విద్యార్థులు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పొతంగల్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

కోటగిరి,ఆగస్టు14: పొతంగల్ మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను బుధవారం విండో అధ్యక్షులు శాంతేశ్వర్ పటేల్ ప్రారంభించారు. నాబార్డు నిధులు సుమారు 60లక్షల వ్యయంతో 15షెట్టర్లు నిర్మించినట్లు విండో అధ్యక్షులు తెలిపారు. త్వరలోనే షాప్‌లను టెండర్ నిబంధనల ప్రకారం అద్దెకు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో డైరెక్టర్‌లు విజయ్ పటేల్, నాయకులు దిగంబర్, సిద్దు, లక్ష్మణ్, విండో కార్యదర్శి భరత్, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలో మొక్కలు నాటిన వ్యవసాయ అధికారి

రెంజల్,ఆగస్టు14: ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం రెంజల్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి వాజీద్ హుస్సేన్ మొక్కలు నాటి పంపిణీ చేశారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



దోమకొండ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

దోమకొండ, ఆగస్టు 14 : మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలతో వివిధ రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్నారు. పదిరోజుల నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలు వయసుతో సంబంధం లేకుండా ఒళ్లునొప్పులు, జ్వరంతో బాధపడుతూ దోమకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం ఆసుపత్రిలో పురుషుల, స్త్రీల వార్డులో బెడ్స్‌రోగులతో నిండిపోయాయి. ఆసుపత్రి సుపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్యులు, నర్సులు రోగులకు చికిత్సలు అందిస్తున్నారు.

మత్తుపదార్థాలకు బానిస కావద్దు

దోమకొండ, ఆగస్టు 14 : గంజాయి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం సంగమేశ్వర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, అబ్కారీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, అబ్కారీ శాఖ అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గ్రామంలో మత్తుపదార్థాలు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అబ్కారీ కానిస్టేబుళ్లు శ్వేత, సాగర్, పంచాయతీ కార్యదర్శి వసంత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు , విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ , అధ్యాపకులు తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించాలని వినతి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 14 : ఉమ్మడి మద్నూర్ మండలంలో సర్పంచ్‌గా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే ఇప్పించాలని కోరుతూ మద్నూర్ మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో రాణికి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని 34 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు బుధవారం మద్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను కలిసి తమ గోడు వినిపించారు. ప్రభుత్వం తమ గోడును వినిపించుకుని బిల్లులను త్వరగా మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ధర సురేష్, సర్పంచ్‌లు గఫార్, మధుకర్, భీమ్‌రావు, కాశీనాథ్, ఎం.కే పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి మృతి

బాన్సువాడ, ఆగస్టు 14 : బాన్సువాడ పట్టణంలోని ఎల్లయ్య చెరువు కట్ట వద్ద పాత బాన్సువాడకు చెందిన మంగలి రాజు (55) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రాజు పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన మంగలి షాపు పెట్టుకుని జీవనం గడిపేవాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా లక్ష్మీనారాయణ

ఎల్లారెడ్డి, ఆగస్టు 14 : ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నూతన ప్రిన్సిపాల్‌గా లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంచార్జి ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఇటీవల సాధారణ బదిలీలలో ఎల్లారెడ్డికి వచ్చినట్లు తెలిపారు.

'మెరిట్ ఆధారంగా డీలర్లను ఎంపిక చేయాలి'

బాన్సువాడటౌన్ , ఆగస్టు 14 : రేషన్ డీలర్ ఎంపిక మెరిట్ ఆధారంగా చేయాలంటూ బుధవారం బీజేపీ నాయకులు బాన్సువాడ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్‌డీలర్ల ఎంపికకు ప్రభుత్వం పరీక్ష పెట్టడం జరిగిందని, పరీక్షలో అధిక మార్కులు వచ్చిన వారినే ఎంపిక చేయాలని వారు డిమాండ్ చేశారు. నాయకుల ఒత్తిళ్లతో వారి అనుచరులకే డీలర్‌గా ఎంపిక చేయడం భావ్యం కాదన్నారు. ఇంటర్వ్యూ పద్ధతిని వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. అనంతరం ఆర్డీవో రమేశ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

కామారెడ్డి రూరల్, ఆగస్టు 14 : క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇంకా ఎన్నో పతకాలు సాధించాలన్నారు. వీరిలాగే ఇంకా చాలామంది విద్యార్థులు క్రీడాల్లో పాల్గొంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తెలంగాణ నుంచి జిల్లాకు చెందిన క్రీడాకారులు చెస్,బాక్సింగ్ ఛాంపియన్షిప్‌లో పిట్లంకు చెందిన తక్కడపల్లి ప్రతిభ ఐదు బంగారు, వెండి పతాకాలు, విజయ రాఘవేందర్ రెండు వెండి పథకాలు ఏషియన్ గేమ్స్‌లో ఒకటి,ఇండియన్ ఓపెన్ గేమ్‌లో ఒకటి చొప్పున పథకాలు పొందారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కామారెడ్డి రూరల్, ఆగష్ట 14 : కామారెడ్డి కెనరా బ్యాంక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ విద్యాజ్యోతి ఉపకార వేతనాల పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరికి చెందిన ఐదు నుంచి 10వ తరగతి చదువుకునే విద్యార్థులకు సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా 3లక్షల రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతులను ఎల్‌డీఎం రవికాంత్ అందించారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీఈవో రాజు, జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ లాలూ నాయక్ చేతుల మీదుగా నగదు బహుమతులు అందించి, వారిని అభినందించారు.

పాఠశాలను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ ధర్నా



పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 14: జుక్కల్ మండలంలోని పెద్దగుల్ల గ్రామ శివారులో గల ప్రయివేట్ పాఠశాలను మూసివేయాలంటూ బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ గుల్లా గ్రామ శివారులో గల ప్రయివేట్ పాఠశాల నిర్మాణం పూర్తికాకుండానే అసంపూర్తిగా ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అంతేగాక పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని మరుగుదొడ్లు, తాగునీరు లేవని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న తరగతి గదులలో స్టీలు, ఇతర సామాన్లు నిల్వచేయడం వల్ల విద్యార్థులకు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. జిల్లా విద్యాశా ఖాదికారి స్పందించి ప్రయివేట్ పాఠశాలను మూసివేయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పిర్దోస్, నాయకులు సునీల్, రాహుల్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

దాడులను ఖండించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

కామారెడ్డి టౌన్, ఆగస్టు 14 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను బీజేపీ ముక్త కంఠంతో ఖండిస్తుందని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలు దేశానికి ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్య దర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, మున్సిపల్ ఫ్లోర్‌లీ డర్ శ్రీకాంత్, కౌన్సిలర్ శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

దోమకొండలో...

దోమకొండ: మండల కేంద్రంలో బుధవారం తిరంగా ర్యాలీని కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పాత బస్టాండ్ చౌరస్తాలోని ఛత్రపతిశివాజీ విగ్రహం నుంచి మొదలై ప్రధాన వీధులగుండా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కంది మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

బంద్ సంపూర్ణం..

లింగంపేట :మండల కేంద్రంలోని దుకాణాలు, హోటల్స్, ఇతర వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ కు సహకరించారు. హిందూవులపై జరుగుతున్న దాడులను ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఖండించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చైతన్యకుమార్ బందోబస్తును ఏర్పాటు చేశారు. హిందు ఐక్యవేదిక సభ్యులు క్రాంతికుమార్, దత్తురాంలు, బొల్లారం సాయిలున్నారు.

రాజంపేట : మండల కేంద్రంలో బుధవారం తిరంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పిట్లశ్రీను మాట్లాడుతూ ప్రతి ఇంటిమీద జెండా ఎగురవేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భిక్కనూరు : మండల కేంద్రంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పెద్దఎత్తున బైక్‌ర్యాలీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి పైడి రాజశేఖర్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్ : పట్టణంలో బుధవారం సాయంత్రం బీజేపీ నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గార్గే , ఢాకయ్య , రాజాసింగ్ ఉన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతం అయ్యింది. దుకాణదారులు తమ దుకాణాలు మూసివేసి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు.

బీర్కూర్ : పట్టణంలో వాణిజ్య, వ్యాపార , సంస్థలు బంద్ పాటించాయి. హిందూ ఐక్య వేదిక నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

డోంగ్లిలో ఎమ్మెల్యే పర్యటన



ఎన్‌బూర గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్, ఆగస్టు 14 : డోంగ్లి మండలంలోని ఎన్‌బూరా గ్రామంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బుధవారం పర్యటించారు. ఎన్‌బూర గ్రామం నుంచి రాచన్న శివాలయం వరకు రోడ్డు అధ్వానంగా ఉందని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మట్టి రోడ్డు వేయిస్తానని హామీనిచ్చారు. నిధులు కేటాయించి, బీటీరోడ్డు వేయిస్తానని అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సౌకర్యం కల్పించటానికి తన వంతు శాయశక్తుల కృషిచేస్తానని, ప్రతి గ్రామానికి బీటీ రోడ్లు ఉండే విధంగా నిధులు మంజూరు చేయిస్తానని హామీచ్చారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను నెరవేర్చామని, రాబోయే నాలుగేళ్ళలో మరిన్ని అభివృద్ధి పనులు చేసి జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఆయనతో పాటు మద్నూర్ మండల మాజీ ఎంపీపీ ప్రజ్ఞ కుమార్, కాంగ్రెస్ నాయకులు యూనూస్ పటేల్ పాల్గొన్నారు.

కామారెడ్డిలో రాజీవ్ సందేశ్ యాత్ర



యాత్రజ్యోతితో నాయకులు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 14 : రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధి కోసం పాటుపడిన నాయకుడు అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్‌శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం కామారెడ్డి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌సందేశ్ యాత్ర జ్యోతిని కామారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇందుప్రియకు అందించారు. కంప్యూటర్ రంగంలో గాని పేద ప్రజల అభ్యున్నతిలో కాని రాజీవ్‌గాంధీ ఎనలేని సేవచేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, భీంరెడ్డి,యాదవరెడ్డి,గోనెశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపఎన్నికలు వస్తాయనడం హాస్యాస్పదం

● బాన్సువాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

బాన్సువాడ, ఆగస్టు 14 : బాన్సువాడలో ఉపఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ అనడం హాస్యాస్పదమని బాన్సువాడ మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ బాన్సువాడలో ఎమ్మెల్యేగా మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఉన్నారని, ఏ విధంగా ఉపఎన్నికలు వస్తాయో కేటీఆర్ ప్రజలకు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బాన్సువాడలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు అవుతుందనే భయంతోనే బాన్సువాడల్లో ఉప ఎన్నికలు వస్తాయని వ్యాఖ్యలు చేశారని వారు ఆరోపించారు. బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెంటనే ఉన్నారని, భవిషత్తులో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పోచారం శ్రీనివాస్ రెడ్డికే పట్టం కడతారని అది కేటీఆర్ గుర్తించాలని వారు సూచించారు. బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు కేటీఆర్ మాటలు నమ్మే పరిస్థితిలో లేరని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, సొసైటీ ఛైర్మన్ ఎర్వాల కృష్ణారెడ్డి, నాయకులు మోహన్ నాయక్, నార్ల సురేష్, ఎజాజ్, కాలేక్, దాసరి శ్రీనివాస్, అఫ్రోజ్ సంగ్రామ్ నాయక్, రాజేశ్వర్ గౌడ్, బాలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో బాలుడిపై వీధి కుక్కల దాడి



గాయాలైన బాలుడు

ఎల్లారెడ్డి, ఆగస్టు 14 : బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన ఎల్లారెడ్డిలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని గాంధీ చౌక్ వెనుకాల డైలీ మార్కెట్ సమీపంలో బుధవారం సాయంత్రం జ్ఞానరాజ్ (4) అనే బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా మీద పడి తీవ్రంగా గాయపరిచాయి. బాలుడు అరుపులు విని కుటుంబ సభ్యులు గమనించి కుక్కల దాడి నుంచి కాపాడారు. వైద్య నిమిత్తం కొరకు కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడికి చికిత్స నిర్వహించారు. మున్సిపల్ అధికారులకు స్పందించి కుక్కల బెడదను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మహంకాళీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

భిక్కనూరు,ఆగస్టు 14 : మండల కేంద్రంలోని మహంకాళీ అమ్మవారి ఆలయంలో బుధవారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ మేరకు మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డిటౌన్,ఆగస్టు 14: కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పలు అంశాలపై గవర్నర్‌తో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మోడల్ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

బాన్సువాడ, ఆగస్టు 14 : మోడల్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను వెంటనే బదిలీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం బాన్సువాడ మండలం కొత్తబాది మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు భోజన సమయ విరామంలో ప్లకార్డులతో పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఫకీరయ్య మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఒకే చోట ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ బదిలీలు ప్రభుత్వం చేపట్టడం లేదని దీంతో చాలా ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ బదిలీలు చేపట్టినట్లయితే ఈ నెల 21న హైదరాబాదులో టీఎస్ ఎంఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రిలే నిరాహార దీక్షలో పాల్గొంటామని వారు తెలిపారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన చెస్‌బాక్సింగ్ చాంపియన్

బాన్సువాడటౌన్ , ఆగస్టు 14 : ఇంటర్నేషనల్ చెస్ బాక్సింగ్ చాంపియన్ ప్రతిభ తక్కెడపల్లి బుధవారం కామారెడ్డి కలెక్టర్ ఆశిశ్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని పతకాలు సాధించి దేశానికి, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో తక్కెడపల్లి విజయరాఘవేంద్ర ఉన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి

బాన్సువాడ, ఆగస్టు 14 : బాన్సువాడ పట్టణ శివారులోని కొయ్యగుట్ట పీఆర్ గార్డెన్ వద్ద మంగళ వారం సాయంత్రం ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతిచెందినట్లు సీఐ కృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే... పోశకళ (35) అనే మహిళ బాన్సువాడ నుంచి కొయ్యగుట్ట వైపు నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఆ మహిళను స్థానికులు బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయగా పోశకళ అనే మహిళ మృతిచెందిందని తెలిపినట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. గుర్తుతెలియని ద్విచక్ర వాహనం గుర్తించి అతనిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని దర్యాప్తు చేయాలని కుటుంబసభ్యులు ఫిర్యాదు ఇచ్చినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

వేధిస్తున్న వారిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి, ఆగస్టు 14 : వేధింపులకు గురిచేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.... మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గడ్డం ప్రియాంక బాలాజీనగర్ తండాకు చెందిన రత్నావత్ నటరాజ్ ఏడునెలల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. కొన్నినెలల నుంచి భర్త నటరాజ్ అత్త జున్ను, మామ హరి కట్నం తీసుకు రావాలని రోజూ వేధింపులకు గురిచేస్తున్నాడని ప్రియాంక చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు.

ప్యాంట్ జేబులో పేలిన సెల్‌ఫోన్



పేలిన సెల్‌ఫోన్

పిట్లం, ఆగస్ట్ 14 : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో బుధవారం ఎస్సీ కాలనీకి చెందిన ఎనిగెసాయిలు ప్యాంట్ జేబులో రెడ్‌మీ9 సెల్‌ఫోన్ పేలింది. సాయిలు ఫోన్ రింగ్ రాగా జేబులో నుంచి తీసే క్రమంలో ఒక్కసారిగా ఫోన్ పేలిందని సాయి లు తెలిపారు. కాని తనకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. ఫోన్ వెనుకభాగం పూర్తిగా కాలిపో యిందని చెప్పారు.

బస్సుపై తెగిపడిన విద్యుత్ తీగలు

బీర్కూర్, ఆగస్టు 14 : మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వద్ద బస్సుపై విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో స్పందించి విద్యుత్ నిలిపి వేయడంతో భారీ ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సుమారు 80 మంది ప్రయాణికులతో బీర్కూర్ మీదుగా దెగ్లూర్ వెళుతుంది. ఈ క్రమంలో బీర్కూర్ బస్టాండ్ వద్ద బస్సు వెనక్కి తీసుకునే సమయంలో విద్యుత్ తీగలు తెగి బస్సుపై పడ్డాయి. మంటలు చెలరేగాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు కేకలు పెడుతూ భయాందోళనకు గురయ్యారు. అక్కడ ఉన్న వారు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి జరిగింది చెప్పారు. వెంటనే అప్రమత్తమయిన అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రయాణికులకు పెద్ద ప్రమాదం తప్పింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థులకు సైబర్‌క్రైం పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డిటౌన్,ఆగస్టు 14:కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి ఒకేషనల్ కళాశాలలో విద్యార్థులకు సైబర్‌క్రైంపై బుధవారం పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య వ్యక్తి ఎదగడానికి గొప్ప ఆయుధమని తెలిపారు.ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మొబైల్ ఫోన్‌లలో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దనితెలిపారు.అదేవిధంగా ట్రాఫిక్ రూల్స్, షీటీంపనితీరు,చర్యలు,హ్యూమన్ ట్రాఫికింగ్‌పై వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ హన్మంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపక బృందం స్వప్న,భవాని, సుమశ్రీ, సారిక, ధనలక్ష్మీ, శివ,రమేష్ పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - ఓసీ
దర్పన్ - మురారి
ప్రియా 70 - కల్కి
ప్రియా 35 - కమిటీ కుర్రోళ్లు

బాన్సువాడ

మహేశ్వరి - మిస్టర్ బచ్చన్
వెంకటేశ్వర - తుఫాన్ (మార్నింగ్‌షో) కమిటీ కుర్రోళ్లు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

